# మంచుతెరలు

వరుడు రామారావు.

వధువు సీతామహలక్ష్మి

పేర్లు కుదరడమే కాదు. వయస్సూ, రూపం, అందం, ఆకర్షణా, అన్నీ కుదిరాయి. దంపతులంటే ఇలా ఉండాలి అని మనస్సులో ముచ్చటపడ్డం సరే- ఒకటికి రెండుసార్లు బాహాటంగా చెప్పుకుని మరీ మురిసిపోయారు, బంధుమిత్రులతోబాటు పెళ్ళికి విచ్చేసిన సమస్త జనసందోహమూను.

అవునుమరి - ఆశ్చర్యమేముంది?

బిరుసైనక్రాపూ - గంభీరమైన ముఖం. ఆరడుగుల ఎత్తూ - ఎరుపూ పసుపూ కలిపిన అందమైన మేనిఛాయా - మగసిరి ఒలికిపోతూ, పట్టుతాపితాలో తళతళా మెరిసిపోతూ రామారావు కూర్చుంటే, పెళ్లి పీట్లమీద ఆ ప్రక్కనే బారెడు పువ్వుల జడతో చారెడేసి కాటుక కళ్ళతో బంగారం వజ్రపు పొడిని పాలలో మెదిపి చేసిన అందాల కుందనపు బొమ్మలా, స్త్రీ సౌందర్యానికంతకీ తనే ప్రతినిధిలా, పెళ్ళి పందిరంతా వెలుగులు జిమ్ముతూ, మెరుపుతీగలా కూర్చుంది సీతామహలక్ష్మి.

ఒక్కరూపంలోనేనా? చదువులో, సంపదలో, హోదాలో ఎవరికెవరూ తీసిపోరు. అతను ఇంజనీర్ అయితే ఆమె ఎమ్.ఏ. లిటరేచరు. రామారావు తండ్రి సబ్‌కలెక్టర్‌గా చేసి రిటైరయితే, సీత నాన్నగారింకా ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరుగా పనిచేస్తున్నారు.

ఆయనకి పట్నంలో రెండు మేడలుంటే, ఆయనకి పల్లెలో సుక్షేత్రమైన పదెకరాల మాగాణీ ఉంది. ఇద్దరికిద్దరూ దర్జా అయిన మనుషులు. పైగా ఒకరి గురించి ఒకరికి బాగా తెలిసిన చిన్ననాటి స్నేహితులు. అందుకే వియ్యం అందారు, పిల్లలిద్దరూ అలనాటి సీతారాముల్లా అన్యోన్యంగా జీవిస్తారని ఆశిస్తూ.

వాళ్ళ ఆశలూ, పెళ్ళికి వచ్చిన బంధుమిత్రుల అంచనాలూ అన్నీ నిజం అయ్యేవే, అటు నుంచి రామారావు స్నేహితుడూ, ఇటునుంచి సీతామహలక్ష్మి మేనత్తా, పెళ్ళికి ముందు, వాళ్ళ మనస్సుల మీద, మంచుతెరలు దించకుండా ఉంటే.

"ఒరేయ్ రామారావ్! జాగ్రత్తరోయ్! ఆడవాళ్లు మగవాళ్ళని ఇట్టే లొంగదీసుకుని అట్టే పెత్తనం ప్రారంభిస్తారు. ఒకమారు కనక జుట్టు చేతికిచ్చావో, ఇహ చూస్కో - గోవిందా! జీవితాంతం బానిస బ్రతుకే!" అంటూ పుచ్చుకున్న శుభలేఖని విసన కర్రలాతిప్పి విసురుకుంటూ చక్కాపోయాడు రంగధామం.

అంత ఘాటుగా కాకపోయినా సుభద్రమ్మ కూడా అలాంటి ఉచిత సలహాయే సీతామహలక్ష్మికి అందించింది. "ఇదిగో కోడలుపిల్లా! పెళ్ళి అని సంబరపడకు. ఇది మగాడు ఆడదాని మెడకి ఉచ్చు తగిలించే భయంకర సన్నివేశం. ఎన్ని చెప్పినా ఇది పురుషాధిక్యత గల ప్రపంచం. అధికారం చలాయించాలని చూస్తాడు మగాడు. మరి నీ వ్యక్తిత్వం ఎలా కాపాడుకుంటావో!" ఆవటా అంటూ - దాంతో ఊరుకోకుండా, భార్యల్ని హింసించే భర్తల తాలూకు గాధల్ని వివరించే అయిదారు ఆధునిక నవలల్ని కూడా పట్టుకొచ్చి ఇచ్చింది, ఇవి చదవమంటూ.

ఇలా అటు రంగధామం, ఇటు సుభద్రమ్మ పని గట్టుకుని సరఫరా చేసిన సలహాల పుణ్యమా అని, మనసులో మరులు నింపుకొని పురివిప్పిన కోర్కెలతో సరదాగా పెళ్ళిపీటలమీదికి రావలసిన ఆ వధూవరులిద్దరూ, పరస్పరం అపోహలతోనూ అనుమానంతోనూ, కవచం తొడుక్కుని కత్తినూరుకొని మరీ సంసిద్ధం అయ్యారు పెళ్ళికి.

అందుకే - పెళ్ళికి వచ్చినవాళ్ళంతా ఛలోక్తులతోనూ పరిహాసాలతోనూ సరదాగా నవ్వుకుంటూ ఉంటే వాళ్ళిద్దరూ మాత్రం, కళ్ళల్లోచిలిపితనం, పెదిమల మీద చిరునవ్వూ, మనస్సులో మధురిమా, గుండెల్లో పులకింతా - ఇవేం లేకుండా, ఒకళ్ళనొకళ్లు కళ్ల చివర్లనుంచి కనిపెడుతూ, ఎవళ్ళ జాగ్రత్తలో వాళ్ళు ఉండి, ముభావంగా సీరియస్‌గా బద్ధ శత్రువుల్లా పెళ్ళిపీటలమీద కూర్చున్నారు ఒకరిపక్కన ఒకరు. తల్లి దండ్రులిద్దరూ అతని కాళ్ళు కడిగి, కొబ్బరి బొండంతో తనని అతని చేతిలో పెట్టినప్పుడు ముఖం చిట్లించింది సీతామహలక్ష్మి. జీలకర్రా బెల్లం తన నెత్తిమీద ఆమె పెట్టినప్పుడు, తన జుట్టు ఆమె గుప్పిట్లోకి వెళ్లినట్టుగా పౌరుషపడ్డాడు రామారావు.

మంగళసూత్రం కడుతున్నప్పుడు తన మెడకి ఉరి పడుతోందని ఆమె విలవిల్లాడిపోతే, సప్తపదిలో తన కాలిమీద ఆమె కాలువేసి పురోహితుడు తొక్కించినప్పుడు, అతను కోపంగా చూశాడు. అతని పురిషిట్లో నీళ్ళు పొయ్యమన్నప్పుడు ఆమె విసుగ్గా చూసింది.

ఆమె కాలి వేళ్ళకి మట్టెలు తొడగడం అతని పౌరుషానికి అడ్డువచ్చింది. అలాగే అతని చిటికెన వ్రేలు పట్టుకుని అతని అడుగులోనే అడుగు వేసుకుంటూ నడవమంటే విసురుగా చూసింది.

తలంబ్రాలూ, లాజహోమం, నాగవల్లి, సరిబేసులూ, బంతులాటలూ - అన్ని తంతుల్లోను అదే నిర్లిప్తతా అదే నిరుత్సాహం - చుట్టూ ఉన్నవాళ్ళు మురిసిపోవడమేకానీ వాళ్ళిద్దరూ ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చున్నారు.

"పెద్దవాళ్ళకి దణ్ణాలు పెట్టివద్దాం - రా" అన్న రామారావు పిలుపు, సీతామహలక్ష్మికి ఆజ్ఞలా వినిపించింది. "మాఫ్రెండ్స్‌ని కాస్త వెళ్ళి పలకరించండి" అన్న సీతామహలక్ష్మి మాట, రామారావుకి శాసనంలా అనిపించింది. ఆమె అడిగిన ఓ ప్రశ్నకి అతను నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు. కలర్ ఫోటోకి అతను కట్టుకు రమ్మన్నచీర ఆమె కట్టుకురాలేదు.

ఇలా పెళ్లి రెండురోజులూ, వాళ్ళిద్దరి మధ్యా నిశ్శబ్దమైన పోరాటం నిర్విరామంగా సాగుతూనే ఉంది.

ఏ ఒక్కళ్ళూ వెనకడుగు వెయ్యలేదు.

పోనీలే అని సర్దుకుపోనూలేదు.

ఎవరి జాగ్రత్తలు వాళ్ళు తీసుకున్నారు.

ఎవరి వ్యక్తిత్వం వాళ్ళు జాగ్రత్తగా కాపాడుకున్నారు.

పెళ్ళయ్యాక కూడా హోటల్ మెతుకులేం తింటాడని, పెద్దలు నలుగురూ ఆలోచించి మనుగుడుపులవుతూనే, సీతని రామారావు ఉద్యోగపు ఊరికి కాపురానికి పంపించేశారు.

మూడు గదుల అద్దె ఇంట్లో కాపురం. ఇంట్లోకి కావలసిన సరుకులు నౌఖరులా తేవలసి వస్తోందిరా భగవంతుడా అని బాధపడుతూ తెచ్చిపడేశాడు రామారావు. ఇంక తనికిలా వంటలక్కలా వండిపెడుతూండాలి కాబోలురా దేవుడా అని విసుక్కుని అయిష్టంగా ఇంత వండి పడేసింది సీతామహలక్ష్మి.

అన్ని పనులూ యాంత్రికంగా జరుగుతూ వున్నా, ఎవరి సరిహద్దులు వాళ్ళు చెరుపుకోలేదు.. ఎవరి స్వాభిమానాన్ని వాళ్ళు తగ్గించుకోనూలేదు.

లోకువ కాకూడదు. వ్యక్తిత్వం కాపాడుకోవాలి అని అతను - అలుసు ఇవ్వకూడదు,ఆత్మగౌరవాన్ని రక్షించుకోవాలి అని ఆమే -

ఇద్దరి మధ్యా గంభీరమైన మౌనం -

ఇద్దరిలోనూ ఆందోళనా - ఆరాటం - భయం - వెరపూ - పట్టుదలా - పౌరుషం.

భోజనం అయ్యాక తమలపాకులకి సున్నంరాసి చిలకలు చుట్టి ఇస్తుందేమోనని అతను ఎదురు చూశాడు. అతను అడుగుతాడేమో అని ఆమె అనుకుంది. అతను అడగలేదు. ఆమె ఇయ్యలేదు. అలా అని సర్దుకుపోతే అదోరకంగా ఉండును కాని ఆమె ఇయ్యలేదని అతనికి పౌరుషం - అతను అడగలేదని ఆమెకి కోపం!

రూపం అందంగా ఉంటే సరా?

ఆలోచనలు అందంగా లేకపోయాక!

ఆ రోజంతా సీతామహలక్ష్మి చిరచిరలాడుతూనే ఉంది. ఒక్కమారైనా చిరునవ్వుతో కనిపిస్తుందేమో, "అలా షైరు వెళ్ళివద్దామా" అని అడుగుదామనుకున్నాడు. ఆ చిహ్నాలేం కనిపించకపోయేసరికి అడగడం, 'కాదు' అనిపించుకోవడం ఎందుకు అనుకొన్నాడు - ఒక్కడే వెళ్ళాడు.

కనీసం రమ్మనికూడా అనలేదు చూశావా. ఇక్కడ తనకి వండిపెట్టడానికేకానీ, కలిసి షైరు వెళ్ళడానికి తగనన్నమాట. స్త్రీని బానిసగానే కానీ సమానంగా చూసే మనస్తత్వం ఉంటేగా? - సీత అనుకొంది.

రాత్రి భోజనలయ్యాక మంచం మీద సీతా, సోఫాలో రామారావూ, నిద్రపోయారు. అసలా మాటకివస్తే ఇద్దరూ నిద్దరే పోలేదు. కళ్ళు మూసుకుని పడుకున్నారు. అంతే!

"హాయిగా ఎలా నిద్రపోతోందో?" మనస్సులోనే హుంకరించాడు రామారావు.

"నిశ్చింతగా పడుకున్నాడు. పురుషాహంకారం పుష్కలంగానే ఉంది అబ్బాయిగారికి, సరేకానియ్యి" అని కోపంతో అటు తిరిగి ఒత్తిగిలి పడుకుంది. వీరవెంకట సీతామహలక్ష్మి

గంట అయింది.

గంటన్నర దాటింది.

రెండు గంటలు కావస్తోంది.

ఇద్దరూ ఊపిరి బిగపట్టుకుని కళ్ళు మూసుకునిచూస్తున్నారు. అవును. చూస్తున్నారు. మూసుకున్నా గమనిస్తూనే ఉన్నాయి వాళ్ళ కళ్ళు, అవతలివాళ్ళ కదలికల్ని.

కాసేపయ్యాక రామారావు నెమ్మదిగా లేచాడు. లేచి, సాయంత్రం తను షైరునుంచి వస్తూ తెచ్చి, అలమారులో ఉంచిన మల్లెపువ్వుల పొట్లం తీసి, ఆమె మంచం దగ్గరికి నడిచాడు. గాఢమైనకోరికలు గుండెల్లోంచి పెల్లుబుకుతూంటే, వణుకుతూన్న చేతుల్తో మల్లెల్ని సుతారంగా, ఆమె జడలో తురిమాడు.

వళ్ళంతా ఝల్లుమంది సీతామహలక్ష్మికి.

నిద్రమత్తులో అటునుంచి ఇటు వత్తిగిలినట్లు వత్తిగిలి, తన చేతిని అతని ఒళ్ళో వేసింది.

రామారావు నిలువెల్లా పులకించిపోయాడు. తన్ను తాను సంబాళించుకో లేకపోయాడు. పట్టలేని తమకంతో, ఆమె చుట్టూ చేతులువేసి దగ్గరగా తీసుకున్నాడు.

ఆమెకూడా స్తబ్దంగా ఊరుకోలేకపోయింది. అతనికౌగిలిలో గువ్వలా ఒదిగిపోయింది.

మరింత దగ్గరగా పొదుపుకుంటూ 'సీతా' అన్నాడు సుఖపారవశ్యంవల్ల బొంగురుపోయిన కంఠంతో -

"ఊఁ!" అంది ఆమె మమతల చిరునవ్వుతో మత్తుగా.

"నువ్వు నా రాణీవి - నేను నీ దాసుణ్ణి" అన్నాడు పట్టరాని ఆవేశంతో ఉద్రేకంగా.

తన చేత్తో అతని నోటిని మూసి" అలా అనకండి. మీరు నాదైవం" అంటూ అతని గుండెల్లో తల దాచుకొంది సీత. ఇద్దరిమధ్యా రసానుభూతులు రాజ్యమేలాయి.

మధురమైన ఆ ఆనందమయ సమయంలో, అపోహలూ, అనుమానాలూ, ఆధిక్యతలూ ఆత్మగౌరవాలూ అన్నీ మంచుతెరల్లా కరిగిపోయి, ఇద్దరం ఒకటే అనే అద్వైతభావం వాళ్ళ హృదయాల్లో అనురాగజ్యోతిని వెలిగించింది.

*(1991 స్వాతి)*